క్లుప్తంగా

మొబైల్ సిగ్నల్ లేక తిప్పలు



సాత్నాల: నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ అనేది మన జీవన విధానంలో ఒక భాగంగా మారింది. 25 రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రాకపోవడంతో సైద్‌పూర్, రేణిగూడ, డౌన, అర్జుని, పరస్‌వాడ్ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివాసీలకు అందుబాటులో ఉన్న ఏకైక నెట్వర్క్ బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రాకపోవడంతో ఆసుపత్రి, అత్యవసర పరిస్థితుల్లో సమాచారాన్ని అందించలేకపోతున్నారు. రైతులు వ్యవసాయ సమాచారాన్ని పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లన్నకు జలహారతి



మల్లన్న ఆలయం చుట్టూ నీరు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్నకు వరుణ దేవుడు జలహారతినిచ్చాడు. కాకతీయుల కాలంలో ఆలయాన్ని చెరువు మధ్యలో నిర్మించారు. ఏటా శ్రావణమాసం ప్రారంభంలోనే ఆలయం చుట్టూ వరద నీరు చేరుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెప్పపై ఆలయానికి చేరుకొని పూజలు చేస్తారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆలయం చుట్టూ నీరు చేరింది. దీంతో వరుణ దేవుడు మల్లన్నకు జలహారతి ఇచ్చాడని భక్తులు పేర్కొంటున్నారు.

'రోడ్డుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తాం'



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలో పశువుల పానాది రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీరోడ్లు, హైమాస్ లైట్ల కోసం కూడా నిధులు కేటాయిస్తానన్నారు. శుక్రవారం మర్లపెల్లి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. గ్రామంలో బీసీలు ఎక్కువగా ఉన్నందున వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సాజన్, మాజీ సర్పంచులు కల్లూరి దేవేందర్, రాథోడ్ రాము, రాథోడ్ అంబాజీ, బీఆర్ఎస్ నాయకులు ఎలుక రాజు, ప్రవీణ్, రప్ చంద్, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపులు మూసివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం వినాయక నిమజ్జనం ఉన్నందున కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు వైన్‌షాపులు మూసివేస్తున్నట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడలో వైన్‌షాపులను శుక్రవారం సాయంత్రం 6.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 10.30 గంటల వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు.

దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నీటి గుంత పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: వానాకాలం సీజన్‌లో ప్రజలు దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్ఎన్ రాజుబా కోరారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో పర్యటించి నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

పక్కా భవనం కరువు

- అద్దెభవనంలో గ్రామ పంచాయతీ కార్యకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న సిర్సన గ్రామస్తులు



నిర్మాణ దశలో వదిలేసిన గ్రామపంచాయతీ భవనం

సాత్నాల: గ్రామ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా ఉండే గ్రామపంచాయతీ కార్యాలయం ఇంకా అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. 2021 -2022 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం నిధుల కింద రూ.20లక్షలతో భోరజ్ మండలంలోని సిర్సన గ్రామ పంచాయతీ భవనం పనులు ప్రారంభించారు. కానీ నిధుల కొరత, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

అద్దె భవనంలో సమావేశాలు

గ్రామ పంచాయతీకి పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో సమావేశాలు నిర్వహిస్తుండడంతో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు, ప్రజలు పేర్కొంటున్నారు. వివిధ రకాల ధ్రువపత్రాల జారీ, పంచాయతీ సమావేశాలు, సంక్షేమ పథకాల పనులపై చర్చలు నిర్వహించలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా భవనం పూర్తవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నామని కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు భవనం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

నామమాత్రంగా గ్రామసభలు



గ్రామంలో గ్రామ పంచాయతీకి భవనం లేకపోవడంతో నామమాత్రంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని సమస్యలపై చర్చలు జరగకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది.

– కాశీరాం, గ్రామస్తుడు

అధికారులు స్పందించాలి



భవన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించాలి.

– తోట రాజన్న, గ్రామస్తుడు

త్వరలోనే అందుబాటులోకి..

అసంపూర్తిగా మిగిలి ఉన్న గ్రామపంచాయతీ భవనం నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తాం. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– హరీశ్, పంచాయతీరాజ్ ఏఈ

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి ఇలా.. వెళ్లేదెలా!



పొన్నారి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరద నీరు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలో రైల్వేలైన్ అండర్ బ్రిడ్జి పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. అండర్ బ్రిడ్జి కింద నీరు ఎక్కువగా నిలిచి ఉండటంతో బ్రిడ్జి కింద నుంచి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటచేలకు వెళ్లే రైతులు ఎరువులను తరలించడానికి ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

'కుల సంఘాల అభివృద్ధికి కృషి'

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడులో గల మున్నూరు కాపు సంఘ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.25 లక్షలతో కాపుసంఘ భవనం అభివృద్ధి చేయాలన్నారు. మున్నూరు కాపు సంఘం నాయకులు అఖిలేష్, సంతోష్ పాల్గొన్నారు.

డౌన గ్రామానికి రోడ్డేది?

- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- ఎటు వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం



బురదమయంగా రోడ్డు

సాత్నాల: స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఆదివాసీల బతుకుల్లో మార్పు రావడం లేదు. గోండు, కొలాం గిరిజన జాతులు నివసించే మండలంలోని డౌన గ్రామంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. 400 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో కనీసం రోడ్డు సౌకర్యం సరిగా లేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టింపు కరువైంది. వానాకాలంలో ఉన్న మట్టి రోడ్డు బురదతో నిండిపోతోంది. ఈ రోడ్డుపై కాలినడక కూడా కష్టమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆస్పత్రులు, మార్కెట్లు, పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చదువుకోవడానికి జిల్లా కేంద్రానికి వెళ్లే సందర్భంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రోగులను అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించాలన్నా గ్రామానికి వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. ప్రతీసారి ఎన్నికల సమయంలో రహదారి నిర్మాణం చేపడతామని అధికారులు, వివిధ పార్టీల నాయకులు హామీ ఇస్తూ ఎన్నికలు ముగిసిన తర్వాత మరిచిపోతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. తమ గ్రామం కూడా అభివృద్ధి చెందాలంటే ముందుగా రోడ్డు అవసరమని చెబుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు కావాలని చాలాసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. వానాకాలంలో రోగులను ఆస్పత్రికి తీసుకువెళ్లే సమయంలో ప్రాణాల మీదికి వచ్చిన సందర్భాలున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామానికి రోడ్డు నిర్మించాలి.

– రాథోడ్ రోహిదాస్, గ్రామస్తుడు

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



ఆదిలాబాద్: కుంకుమార్చనలో మహిళలు



బోథ్: ఆలయాన్ని దర్శించుకున్న అనిల్ జాదవ్



బోథ్: లడ్డూ దక్కించుకున్న అశ్విన్, నరేశ్ రెడ్డి

ఆదిలాబాద్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకినగర్ కాలనీ, శాంతినగర్ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక గణేశ్ మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కుమార్ పేట్ కాలనీలో ప్రతిష్ఠించిన 54 అడుగుల మహా వినాయకుని పూజలో అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ మహాగణపతి ఆలయంలో వినాయకచవితి ఉత్సవంలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంలో జిల్లా కేంద్రానికి చెందిన నెమలికొండ తేజ అనుపమ దంపతులు రూ.65 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు.

ఎమ్మెల్యే పూజలు..

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ రెడ్డి యూత్, ఫ్రెండ్స్ యూత్ గణేశ్ మండపాల వద్ద గణనాథులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని భగత్ సింగ్ కాలనీలో యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకున్నారు. మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ముస్లింలను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం భగత్‌సింగ్ యూత్ సభ్యులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సత్కరించారు.



ఆదిలాబాద్: పూజలో పోలీసు అధికారులు

బోథ్: మండలంలోని కంటెగాం, బాబేర తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ప్రసిద్ధ శ్రీ నర్మదేశ్వర ఆలయాన్ని సందర్శించారు. లింబా మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు.

భారీ ధర పలికిన లడ్డూ..

మండలంలోని పొచ్చెర గ్రామంలోని హనుమాన్ యూత్ మండలి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద శుక్రవారం నిర్వహించిన లడ్డూ వేలంలో ఏకంగా రూ. 50,001 పలికింది. అశ్విన్ కుమార్, నరేశ్ రెడ్డిలు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.



నేరడిగొండ: గణపయ్యకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఆదిలాబాద్: లడ్డూ దక్కించుకున్న భక్తులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



నేరడిగొండ: ముస్లింలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రిమ్స్ అధికారులు, డాక్టర్లతో విద్యార్థులు

బోథ్: బోథ్, సొనాల మండలాల వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోథ్‌లో తమకు పాఠాలు బోధించిన సురేశ్, వైద్య రఘుపతిలను పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

'చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు'

తలమడుగు: చదువుతూనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సాయిలింగి కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్‌వో అర్చన అన్నారు. శుక్రవారం కేజీబీవీలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో 2020 -21 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగడమే గురువులకు అందించే గొప్ప బహుమానమన్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దీపక్ పుష్కర్, డాక్టర్ నరేందర్ బండారి తదితరులు ఉన్నారు.



కేజీబీవీలో ఉపాధ్యాయులకు సన్మానం

'కల్వర్టు నిర్మించండి'

దహెగాం: మండలంలోని కోత్మీర్ గ్రామ పంచాయతీలోని జెండాగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే ఒర్రె ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.



జెండాగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె

ముగిసిన యోగా శిక్షణ శిబిరం



విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న శిక్షకులు

వాంకిడి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టల్‌లో గత మూడు రోజుల నుంచి ఆయూష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు వడ్డూరే దొడ్డాజీ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా ప్రాముఖ్యత వివరించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి అష్టాంగ ప్రాణయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు నిత్యం యోగాసనాలు చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరిగి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని సూచించారు. హాస్టల్ వార్డెన్ మధుకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

రెబ్బెన: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బండారి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోలేటిలో ఈనెల 7న హైదరాబాద్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల స్థితిగతులపై నిర్వహించే సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం కాబోతున్నాయన్నారు. ఇప్పటికే సింగరేణి, ఎన్టీపీసీ, ఎస్టీపీ, ఎఫ్‌సీఐ, ఈసీఐఎల్, బీడీఎల్, బీహెచ్ఈఎల్ ప్రభుత్వ హాస్టల్స్, పంచాయతీ, మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు తక్కువ వేతనాలకే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగంలో ఉన్న 36 రకాల విభాగాల్లో, కేంద్ర సర్వీసుల్లో సుమారు 6లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేసే కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలన్నారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే సదస్సును కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు. గోలేటి ఏరియా అధ్యక్షుడు పోషం, కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు సోమయ్య, లచ్చన్న, లక్ష్మి, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మహిళల గాజుల కార్యక్రమం

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, గిర్నూర్ గ్రామాల్లో మహిళలు శుక్రవారం సామూహిక గాజుల కార్యక్రమం నిర్వహించారు. తమ స్నేహితులకు గోరింటాకు పెట్టి, కొత్త గాజులు తొడిగి మిఠాయిలు తినిపించుకున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించినట్లు పేర్కొన్నారు. ఇంద్రనగర్‌కు చెందిన మీనా నుంచి 4.420 లీటర్లు, గాంధీనగర్‌కు చెందిన రాకేశ్ నుంచి 3.335 లీటర్లు, క్రాంతినగర్‌కు చెందిన హనుమాండ్లు నుంచి 1.250 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.